"నాకేం తెలుస్తుంది అత్తయ్యా!" జాలిగా అన్నది కోడలు ఈ మాటలు.

"సంసారం మీదపడితేగాని అన్నీ తెలుస్తాయి. తెలియక కొన్నాళ్ళయ్యా!" అన్నది కాంతం ఊరడింపుగా.

"నాకు తెలియదు అత్తయ్యా"

"తెలియదూ! ఎందుకు తెలియదే! తెలియకపోతే ఊరుకో. ఎన్నాళ్ళని ఈదమంటావ్ ఈ సంసారాన్ని! నావల్ల కాదమ్మా. అందరు కోడళ్ళా ఎవరి సంసారం వారు నెత్తినేసుకొని ఈదుకొంటున్నారా, నీ మోస్తరు కూర్చుంటున్నారా!"

"ఇష్టదక్కలేని వాళ్ళకర్మం ఏమో నేను చెప్పలేను గాని ఈ సంసారభారం అంతా నెత్తినేసుకునే అవసరం నాకేమీ లేదు. నాకేం! నిక్షేపంలాగ చూచుకుపొయ్యే అత్తగారుంది! అందరికీ ఆ అదృష్టం ఉంటోందా!" అని పొంగుతున్న సంతోషాన్ని అణచుకొంటూ అన్నది సుందరి.

"నీవు అదృష్టవంతురాలవే. అదెట్లాగూ నిజమే. కాని నేను కాశీకి వెళ్ళిపోయిన తరువాత నీవు అన్నివిషయాలూ చూచుకొని ఏంజేస్తావో కాస్త చెప్పవే కోడలా!"

"ఏం జేస్తానా! అసలు నేను మిమ్మల్లను వెళ్ళనియ్యను. శేషునువదల మీరు క్షణం ఉండగలరూ, ఆ సంగతి ముందు మీరు చెప్పండి!"

ఆమె ఇచ్చిన తల ఎత్తలేను. ఏమయినా మహాలక్ష్మి ఆ పిల్ల ఇల్లాగ పూర్తిగా చేసింది.

మా అల్లుడికి గుండె నీరై పోయిందట అమ్మా! అతను అన్నాడట, "పోనీ లేవమ్మా నీవు చేసినది ఏమంత తప్పు పని అని నీవు అంతగా విచారపడతావు! మా అమ్మాయి మంచి పనే చేసింది. కమ్మని ఫలహారాలు పంపింది. నేను కూడా సంతోషించానని చెప్పు. ఇదిగో, ఫలహారాలకు ఇమ్మనమన్న పది రూపాయలు కాక ఇంకా ఐదు ఎక్కువ ఇస్తున్నాను. తీసుకొనిపోయి నీ కూతురుకు ఇవ్వు" అన్నారట. పాపం మా అల్లుడూ మంచివారే ఈ విషయంలో. కనకయ్య ఆ పదిహేను రూపాయలూ తీసుకొచ్చి నా చేతిలో పెట్టాడు.

"ఆ పదిహేను రూపాయలూ నీవు తీసుకొన్నావా వదినా?" అని సుందరి అడిగింది ఏమి తోచిందో ఏమో ఆ పిల్లకు.

ఎందుకు తీసుకుంటాను వదినా. కృతజ్ఞతా భావంతో నా హృదయం బరువెక్కిపోయింది, 'కనకయ్యా, నీవు ఏమీ అనుకోకు. వద్దనకు. ఈ పదిహేను నీవు తీసుకో' అని బ్రతిమలాడాను. అతను తీసుకోలేదు. తీసికోక 'నాకొద్దు అండీ, అమ్మాయిగారూ, అమ్మా, మిమ్మలను కూతురుగా చూచుకొంటున్నాను. కూతురు సొమ్ము తండ్రి ఎక్కడైనా తీసికొంటాడా? అమ్మాయిగారూ. దీనికి మంచి చీర కొనుక్కోండి' అని చెప్పి వెళ్ళిపోయినాడు.

